ఫుట్‌పాత్ కబ్జాలను పట్టించుకోరా?

- ఫుట్ పాత్‌ల పైనే వ్యాపారాలు..
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు..


ఫుట్‌పాత్ కబ్జాచేసి పండ్ల వ్యాపారాలు

బండ్లగూడ: ఫుట్‌పాత్ ఆక్రమణలతో ఇబ్బందులు పడుతున్న పాదచారులు. ఎవరికి తోచినట్లు వారు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. పాదచారుల భద్రతకోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌పై చిన్న చితక వ్యాపారదారులు తిష్ట వేసి నడవడానికి వీలులేకుండా ఫుట్‌పాత్‌లను వాడుకుంటున్నారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

- గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పోలీస్ అకాడమీ నుండి టీఫ్‌కాన్‌ఫూల్ బ్రిడ్జి వరకు ఉన్న ఫుట్‌పాత్‌పై భవన నిర్మాణ సామగ్రి అమ్మకాలతో పాటు, పండ్లు పలు చిరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. పాదచారులు బిక్కుబిక్కుమంటు రోడ్లపైనే నడుస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

అడ్డదిడ్డంగా వాహనాలు..

ఒకవైపు ఫుట్‌పాత్ ఆక్రమణకు గురికావడమే కాకుండా పీబీఈఎల్ సిటీ వెళ్ళే సమీపంలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన పండ్ల వ్యాపారుల వద్ద నుండి కొనుగోలు చేస్తున్న వినియోగదారులు తమ వాహనాలను అడ్డదిడ్డంగా రోడ్లపై పార్కు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి తరుచు ట్రాఫిక్ ఇబ్బందులు తలేత్తుతున్నాయి. దీంతో ప్రమాదాలకు దారితీస్తుంది. సాయంత్రం సమయంలో అక్కడ రోజు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ అధికారులకు ఆక్రమణలపై తగు చర్యలు చేపట్టవలసిందిగా స్థానికులు కోరుతున్నారు.


కాళీమందిర్ సమీపంలో రోడ్డుపైనే వ్యాపారాలు

ఎప్పుడు రద్దీగా ఉంటుంది..

కార్పొరేషన్ పరిధి ఉదయం, సాయంత్ర సమయాల్లో రోడ్డును దాటే పరిస్థితి కనిపించడం లేదంటే ట్రాఫిక్ ఏ మేరకు పెరిగిపోయిందో అర్థమవుతుంది. రోజుకు ఎన్నో వాహనాలు తిరిగే ప్రధాన జాతీయ రహదారి ఇలాంటి రోడ్లపై కబ్జాలు జరుగుతున్నా అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్న తీరుపట్ల సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతుంది.

అధికారులు పట్టించుకోవడం లేదు

అధికారులు నామ్‌కేవాస్తే ఆక్రమాలను తీసివేస్తున్నారు. అయితే తిరిగి మరునాడే కబ్జాదారులు ఫుట్‌పాత్‌లపై దర్జాగా వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. మున్సిపల్ అధికారలు, ట్రాఫిక్ సిబ్బంది పక్కా ప్రణాళికతో ఫుట్‌పాత్‌ల కబ్జాదారులపై కఠిన చర్యలు చేపట్టాలని పాదాచారుల కోసం ఫుట్‌పాత్‌లను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు స్థానికులు, వాకర్స్ కోరుతున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి అమ్మపల్లి బ్రహ్మోత్సవాలు

శంషాబాద్ రూరల్:మండలంలోని నర్కూడలో ఉన్న అమ్మపల్లి (శ్రీసీతారామచంద్రస్వామి) ఆలయం బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవ ఏర్పాట్లను బుధవారం ఆయల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు.

జాతీయ జెండాల పంపిణీ

శంషాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని హ్యాపీ మొబైల్ స్టోర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జెండాలు, కేలండర్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు చేవెళ్ల మహేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ కార్యాల యాలు, ఆర్‌జీఏ పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో జెండాలను పంపిణీ చేశారు. స్టోర్ మేనేజర్ పవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జామ్స్ ప్యాడ్స్ అందజేత

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు చక్కగా చదువుకొని అన్ని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పద్మశాలిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలన కల్పించేందుకు తనవంతు కృషి అందిస్తానన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో పట్టుదలతో శ్రద్ధగా చదవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా స్టడీ అవర్స్‌లో ఈవినింగ్ స్నాక్స్ ఏర్పాటు చేస్తానన్నారు.

క్యాట్‌లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు



మణికొండ: క్యాట్ నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ లెవల్-2 ఫలితాలలో మణికొండ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులు నగదు అవార్డులను సొంతం చేసుకోగా 10మంది పతకాలు, మరో 15మంది మెరిట్ ధృవపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల డీన్ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అనితలు వారిని ప్రత్యేకంగా అభినందించారు.

దృష్టి లోపాలను దూరం చేసుకోవాలి

మణికొండ: దృష్టి లోపాలతో ఇబ్బందులు పడుతున్న వారి సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం వార్డు స్థాయిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నార్సింగి కేంద్రానికి ప్రతి రోజు రెండు వందలపై మంది వస్తున్నా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సృజన, మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ, మండల వైద్య విస్తరణాధికారి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్‌యాదవ్, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పునఃప్రారంభమైన కరాటే శిక్షణ తరగతులు

శంషాబాద్ రూరల్: బాలికల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించడంతో పాటు ఆత్మ రక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని కస్తూర్బాగాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ మాధవి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల కోసం ఏర్పాటు చేసిన కరాటే శిక్షణ కార్యక్రమం కరోనా సమయంలో నిలిచిపోగా.. తాజాగా శిక్షణ తరగతులు పునః ప్రారంభమయ్యాయి. మండలంలోని పాల్మాకులలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం నుంచి ఈ శిక్షణ తరగతులను కరాటే మాస్టర్ శివ ప్రారంభించారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయిన జనం

మైలార్‌దేవ్‌పల్లి: కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కాటేదాన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన ముఖ్యమంత్రికి గవర్నర్‌కు గౌరవం ఇవ్వాలన్న కనీస జ్ఞానం లేకపోయిందన్నారు. తెలంగాణలో ప్రజా స్వామ్య పాలన రావాలంటే కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలన్నారు.

సందడి చేసిన విద్యార్థులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ రవీంద్రభారతి పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో ఆకట్టుకున్నారు. సంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రియా, సుధా తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శంషాబాద్ రూరల్: కంటి వెలుగు శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ తనీ ర్వరాజు అన్నారు. మండలంలోని నర్కూడలో బుధవారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచు సిద్దులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గౌతమిఅశోక్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

శంషాబాద్: పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో గణతంత్ర దినోత్స వేడుకల్లో భాగంగా బుధవారం ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులు, సైనికుల వేషధారణతో దేశభక్తి పెంపొందిలా ఆకట్టుకున్నారు. పోటీలను ప్రిన్సిపాల్ మమత శ్రీనివాస్ పర్యవేక్షించారు.

అంబేడ్కర్ ప్రజాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం

శంషాబాద్: అంబేడ్కర్ ఆలోచన విధానంతోనే సామాజిక సాధికారతకు బాటలు పడ్డాయని అంబేడ్కర్ ప్రజాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం అన్నారు. పట్టణంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్టడీ సర్కిల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..నిమ్న వర్గాల ఉన్నతికి రాజ్యాంగం ద్వారా ఆయన హక్కులను కల్పించారన్నారు. సంఘం ద్వారా అన్ని ప్రాంతాల్లో స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కొండల్ రెడ్డి, కార్యదర్శి మహేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం, రాజేంద్రనగర్ ఇన్‌చార్జి రమేష్, షాబాద్ మండల అధ్యక్షుడు హరిప్రసాద్ పాల్గొన్నారు.

పట్టుదలతో ముందుకు సాగాలి

రాజేంద్రనగర్: పట్టుదలతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సాధించడం సులభతరం అవుతాయని శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకులు పెండ్యాల సాయి మాలిక్ అన్నారు. తైక్వాండోలో తెలంగాణ రాష్ట్రానికి గోల్డ్ మెడల్స్ సాధించడంతో పాటు నేషనల్స్‌కు ఎంపికైన కిస్మత్‌పూర్ ప్రాంతానికి చెందిన షేక్ వాసీమ్‌ను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి


తేజస్వీనగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్

రాజేంద్రనగర్: అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాణ్యతతో పూర్తి చేయాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. తేజస్వీనగర్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులు ప్రజలకు నాలుగు కాలాల పాటు అందుబాటులో ఉండేలా నాణ్యతతో పనులను చేపట్టాలన్నారు. ప్రజలు సైతం తమ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. అత్తాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాములు, విష్ణు తదితరులున్నారు.

రోడ్డు పనులను పర్యవేక్షించిన కౌన్సిలర్

మణికొండ: తన వార్డు పరిధిలో కొనసాగుతున్న సీసీ రోడ్ల పనులను కౌన్సిలర్ పర్యవేక్షించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో రూ.25లక్షలతో సీసీ రోడ్డు పనులను చేపట్టారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా రాత్రి సమయాల్లో చేపడుతున్న పనులు సజావుగా కొనసాగటంతో పాటు నాణ్యతతో కొనసాగేలా కౌన్సిలర్ పురుషోత్తం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్ సహకారంతో వార్డును అన్ని విదాల అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మిగిలి ఉన్న అన్ని రకాల పనులను పూర్తి చేస్తామన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం

మణికొండ మున్సిపల్ చైర్మెన్ నరేందర్ ముదిరాజ్

మణికొండ: ప్రజాస్వామ్య దేశంలో ఓటే ఆయుధంగా వినియోగించుకుని మన అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడే నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బీఎల్‌ఓలు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలతో చేయించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరికి ఓటరుగా నమోదు చేసుకోవటం పై ఉన్న శ్రద్ద పోలింగ్‌లో పాల్గొనే విషయంలో లేకుండా పోతుందన్నారు. డీఈ దివ్యజ్యోతి, మేనేజర్ మల్లారెడ్డి, కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


ఓటరు డే సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న మణికొండ మున్సిపల్ చైర్మెన్, సిబ్బంది

దేవాలయాలతో శాంతి సౌభాగ్యాలు

మణికొండ: ప్రతి రోజు దేవాలయాలకు వెళితే మనసు ప్రశాంతంగా ఉండటంతో పాటు మంచి ఆలోచనలు వచ్చి ధర్మబద్దమైన కార్యక్రమాలను చేపట్టే అవకాశం ఉంటుందని మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మెన్ కె.నరేందర్‌రెడ్డిలు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో శ్రీ లలితా పరమేశ్వరీ సమేత శ్రీ కామేశ్వరస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ట పూజల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ఇప్పటికే ఉన్న రామాలయం పక్కనే శివాలయం రావటం ఎంతో శుభపరిణామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు జె. సిద్దప్ప పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

మణికొండ: పేదలను అన్ని విదాలుగా ఆదుకుని వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన జి. పుష్పమ్మ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందింది. దాంతో ఆమె కుటుంబ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డిలు ఆవిషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి ప్రతిపాదన పంపటంతో రూ.2.50లక్షల చెక్కు మంజూరు కావటంతో దాన్ని బుధవారం ఎమ్మెల్యే అందజేశారు.

పలువురికి కంటిపరీక్ష

బండ్లగూడ: తెలంగాణ 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జోరుగా సాగుతుంది. బుధవారం నిర్వహించిన శిబిరంలో 1వ డివిజన్‌లో 108 మందికి, 19వ డివిజన్‌లో 103 మందికి మొత్తం 211 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.అవసరం ఉన్న వారికి మందులు, కంటి ద్దాలు పంపిణి చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి కంటి పరీక్షలు చేయించుకుంటున్నారని వైద్య సిబ్బంది వెల్లడిస్తున్నారు.


అధికారుల తీరుపై ఆందోళన

మైలార్‌దేవ్‌పల్లి: లక్ష్మిగూడ బుల్‌బుల్‌కుంట చెరువు సమీపంలో శ్మశానవాటికను జేసీబీతో చదును చేస్తున్నారు. లక్ష్మిగూడ ప్రాంతానికి చెందిన ఓ వర్గానికి చెందిన వారు ఆ ప్రాంతంలో మృతి చెందిన వ్యక్తులను దహన సంస్కారాలు చేయడంతో పాటు సమాధులు ఏర్పాటు చేసుకుంటారు. బుల్‌బుల్‌కుంట చెరువు కబ్జాకు గురి కాకుండా జీహెచ్‌ఎంసీతో నీటి పారుదల శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిసింది. శ్మశానవాటిక ప్రాంతంలో తొలగించడంతో ఆ ప్రాంతంలో సమాధుల కింద ఉన్న అవశేషాలు బయటపడడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. శ్మశానవాటిక చదును చేసే సమయంలో స్థానిక ప్రజలు ఒక్కసారిగా అక్కడకు చేరుకోని చేపడుతున్న పనులను నిలిపివేశారు. ఆ ప్రాంతాన్ని వదిలి వేసి ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దూసుకొచ్చిన కారు.. ఐదుగురికి గాయాలు

బస్సు కోసం వేచి ఉన్న వారిని ఢీకొట్టిన కారు


ప్రమాదానికి కారణమైన కారు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

శంషాబాద్ రూరల్: మితిమీరిన వేగంతో వచ్చిన ఓ కారు అదుపు తప్పి బస్సు కోసం వేచి ఉన్న ఐదుగురిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలు కాగా ముగ్గురు చిన్నారులు, మరో మహిళ గాయపడ్డారు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్, స్థానికులు తెలిపిన మేరకు.. మల్కారం గ్రామానికి చెందిన షమీమ్‌బీ(43) రాయన్నగూడ చౌరస్తా సమీపంలో అమ్దాపూర్ వెళ్లే మార్గంలో ఉన్న ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తుంది. రాత్రి విధులు ముగించుకుని బుధవారం ఇంటికి వెళ్లడానికి ఉదయం అమ్దాపూర్-రాయన్నగూడ చౌరస్తాలో షాబాద్ రహదారిపై బస్సు కోసం వేచి ఉంది. ఈమెతో పాటు సమీపంలో ఫాంహౌజ్‌లో నివాసముండే పుష్ప, మరో ముగ్గురు చిన్నారులు బస్సు కోసం నిలబడ్డారు. ఇదే సమయంలో మల్కారం వైపు నుంచి శంషాబాద్ వెళ్తున్న ఓ కారు అతి వేగంతో కుడి వైపు రోడ్డు పక్కన నిల్చున్న వీరి మీదకు దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో షమీమ్‌బీకి తీవ్రగాయాలు కాగా.. మిగతా వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారును డ్రైవర్ అక్కడే వదిలేసి సమీపంలోని పంట పొలాల మీదుగా రాయన్నగూడలో ఉన్న బంధువుల ఇంట్లోకి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. గాయాలైన వీరిని కాచారం గ్రామానికి చెందిన సురేష్ గమనించి అతని కారులో శంషాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమీషనర్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్, టౌన్‌ప్లానింగ్, సెక్షన్ ఇంజనీరింగ్ సెక్షన్‌తో పాటు ఉద్యోగస్తులు, కామన్ ప్లాట్ ఫామ్ ఎన్‌జీవో ఆర్గనైజేషన్ సభ్యులు క్రాంతి వర్మ తదితరలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ఓటర్లకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

కాటేదాన్‌లో కార్పొరేటర్ పర్యటన

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి రోజు బస్తీలు, కాలనీలల్లో పర్యటిస్తున్నట్లు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కాటేదాన్‌లో నెలకొన్న సమస్యలపై జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. ప్రధానంగా భూగర్భ డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు.

ఓటు వేయటం మన బాధ్యత

మణికొండ: ప్రపంచంలోనే మన ఎన్నికల విదానం ఎంతో అత్యుత్తమైనదని, ప్రతి ఒక్కరూ ఓటు వేయటం తమ బాధ్యత అనే విషయం తెలుసుకుని ఓటింగ్‌లో పాల్గొనాలని రాజేంద్రనగర్ ఆర్‌డీఓ చంద్రకళ అన్నారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలోని ఎలక్టోల్ లిటరసీ క్లబ్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఓటరు జాగృత కార్యక్రమాల ముగింపు ఉత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు అనేది వజ్రాయుదంతో సమానమని, అలాంటి దాన్ని నిర్వీర్యం చేసి ఏదో సాదించినట్టు కొందరు భావిస్తున్నారన్నారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి, విద్యార్థుల కార్యకలాపాల సలహాదారు శ్రీనివాస శర్మ, ప్రొఫెసర్ జీఎస్ఆర్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన 160 మంది యాత్రికులు బుధవారం ఉమ్రాకు బయలుదేరారు. ఈ సందర్భంగా యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు శుభాకాంక్షలు తెలిపారు. దాదాపుగా విమానంలో పూర్తిగా యాత్రికుల బృందమే బయలుదేరినట్లు నిర్వాహకులు ఫయాజ్ అలీ తెలిపారు.